

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి



● అదనపు పనిభారం

సమస్యల్లో అంగన్‌వాడీ టీచర్లు

● అద్దె భారం.. అరకొర వేతనాలు ● అదనపు పనులతో ఉక్కిరిబిక్కిరి
● వేతనాల పెంపు హామీని ప్రభుత్వం నిలబెట్టుకునేదెన్నడో?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

గర్భిణులు, బాలింతలు, మూడు సంవత్సరాల నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు సమస్యలతో సతమతమవుతు న్నారు. ఎన్నటికైనా వేతనాలు పెరుగుతాయనే గంపెడాశతో ప్రభుత్వం ఏది చెప్పినా వాటిని నూటికి నూరుపాళ్లు పూర్తి చేస్తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలతో పాటు అద్దె అలవెన్సులను పెంచి ఇవ్వాల్సిన ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న భవనాలు సరిగా అద్దె చెల్లించడం లేదు. దీంతో టీచర్లే వారి వేతనాల నుంచిగానీ, అప్పొసప్పో చేసి అద్దెలు చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

● జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలో అప్‌గ్రేడ్ చేసిన 25 మినీ అంగన్‌వాడీలతో కలిసి మొత్తం 777 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మహిళా శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నాలుగు ప్రాజెక్టులను ఏర్పాటు చేసి ఈ అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. గంగాధర ప్రాజెక్టు పరిధిలో 155, హుజురాబాద్ పరిధిలో 226, కరీంనగర్ రూరల్ పరిధిలో 199, కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో 172 కేంద్రాలు పని చేస్తున్నాయి. వీటి ద్వారా 4,544 మంది గర్భిణులు, 14,689 మంది బాలింతలు, ఏడేళ్లలోపు పిల్లలు 5,021, ఒకటి నుంచి మూడేళ్లలోపు బాలబాలికలు 19,449 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 19,989 మంది, మొత్తం 63,692 మందికి అంగన్‌వాడీల ద్వారా ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 777 మంది అంగన్‌వాడీ టీచర్లు, 777 మంది ఆయాలు పని చేస్తున్నారు.

● 252 కేంద్రాలు అద్దె భవనాల్లోనే..

జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాలుండగా 304 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 252 కేంద్రాలను అద్దె భవనాలను నిర్వహిస్తున్నారు. 223 ప్రభుత్వ పాఠశాలలు, ఇతరత్రా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ భవనాల గదుల్లో అద్దె లేకుండా నిర్వహిస్తున్నారు. కొత్తగా 16 అంగన్‌వాడీ కేంద్రాలకు శాశ్వత భవన నిర్మాణానికి ప్రతిపాదనల ను పంపించారు. పాఠశాలల ఆవరణలో నిర్వహిస్తున్న 62 కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించాలని ప్రతిపాదించారు. యునిసెఫ్ సహకారంతో 200 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు, చేతులు కడుక్కునే సౌకర్యాలను కల్పించారు.



● నెలల తరబడి అద్దెల పెండింగ్

కరీంనగర్ అర్బన్ ప్రాంతంలోని అద్దె ఇళ్లలోని కేంద్రాలకు ఆ గది విస్తీర్ణాన్ని బట్టి నెలకు నాలుగు వేల నుంచి ఆరు వేలు, గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి నుంచి రెండు వేలు అద్దె అలవెన్సులను టీచర్లుకు ప్రభుత్వం ఇస్తోంది. నెలనెలా వేతనాలతోపాటు అద్దె కూడా ప్రభుత్వం మంజూరు చేస్తే వారికి ఇబ్బందులు ఉండవు.

కొన్ని కేంద్రాలకు 10 నెలలుగా, మరికొన్ని కేంద్రాలకు ఆరు నెలలుగా బకాయిలు ఉన్నాయి. ఇంటి అద్దె ఇవ్వక పోవడంతో ఇంటి యజమానులు కేంద్రాలను ఖాళీ చేసి పొమ్మంటున్నారని, కొన్ని చోట్ల అద్దె గదులు దొరకడం లేదని, దీంతో తమ వేతనాల నుంచి కానీ, అప్పోసప్పో చేసి ఇంటి అద్దెలు చెల్లిస్తున్నా మని టీచర్లు వాపోతున్నారు. ఎప్పుడో నిర్ణయించిన అద్దె అలవెన్సులు ఇస్తున్నారని, ప్రస్తుతం ఇంటి అద్దెలు భారీగా పెరిగాయని అంగన్‌వాడీ టీచర్లు అంటున్నారు. అర్బన్ ఏరియాల్లో నాలుగు వేలకు ఇల్లు దొరకడం కష్టంగా మారిందని, ఆమె కొంత డబ్బులు జమచేసి అద్దెలు చెల్లిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి అద్దెలు పెంచాలని, ప్రతి నెలా వేతనాలతోపాటు అద్దెలు ఇవ్వాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు నెలకు 13,650 రూపాయల వేతనం చెల్లిస్తున్నారు. అరకొర వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందని, వేతనాలు పెంచాలని అనేక మార్లు ఉద్యమించిన ఫలితం లేదని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేతనాల పెంపు విషయంలో నాన్చివేత ధోరణితో వ్యవహరించడమే కాకుండా అంగన్‌వాడీలకు వచ్చే వారికి సేవలందించడంతో పాటు అదనపు పనిభారం మోపిందని, వాటిని కూడా ప్రభుత్వోద్యోగులతో సమానంగా చేసినా కనికరం చూపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ టీచర్ల వేతనాలను 18 వేలకు పెంచుతామని ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించడంతో అంగన్‌వాడీలు, అంగన్‌వాడీ సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. ఆరునెలలు గడిచినా వేతనాల పెంపుపై ఎలాంటి ప్రకటన చేయక పోవడంతో నిరాశ చెందారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రభుత్వం ఏమి చెప్పినా చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కోరుతున్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయండి..

కరీంనగర్- జగిత్యాల జాతీయ రహదారి పనులు వెంటనే ప్రారంభించండి..
కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పనులు వేగవంతం చేయండి
కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కరీంనగర్, జగిత్యాల మధ్య భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి పనులు వెంటనే ప్రారంభించాలని సూచించారు. గురువారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్‌లో జాతీయ రహదారి నిర్మాణ పనుల ప్రగతిపై కలెక్టర్ నేషనల్ హైవే అథారిటీ అధికారులు, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ నుంచి జగిత్యాల వరకు జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, అధిక ప్రాధాన్యంతో ఈ పనులపై అధికారులు దృష్టి పెట్టాలని సూచించారు. కరీంనగర్ నంచి వరంగల్ వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే అధికారులు సమన్వయంతో వాటిని పరిష్కరించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని వెంటనే భూ నిర్వాసితులకు అందించాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలోనూ రాజీపడవద్దని, వేగవంతంగా సాగేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. భూసేకరణతోపాటు రహదారి నిర్మాణ పనుల విషయంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాధవి, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా అటవీ శాఖ అధికారి బాలామణి, నేషనల్ హైవే అథారిటీ టెక్ మేనేజర్ లింగయ్య పాల్గొన్నారు.

సుస్థిర పారిశుధ్య నిర్వహణకు యూనిసెఫ్ సహకారం



సదస్సులో పాల్గొన్న యూనిసెఫ్ ప్రతినిధులు

కరీంనగర్, జూన్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): యూనిసెఫ్ సహకారం జిల్లాలో సుస్థిర పారి శుధ్య నిర్వహణకు యూనిసెఫ్ సహకారం అందిస్తుందని రాష్ట్ర వాష్ స్పెషలిస్ట్ వెంకటేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ మూడు రాష్ట్రాల యూనిసెఫ్ ప్రతినిధుల సదస్సు కరీంనగర్‌లో గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర వాష్ స్పెషలిస్ట్ వెంకటేష్ మాట్లాడుతూ పిల్లలు, మహిళల ఆరోగ్యం కోసం యూనిసెఫ్ పాటు పడుతోందని తెలిపారు. మూడు రోజులపాటు జరు గునున్న ఈ సదస్సులో యూనిసెఫ్ ద్వారా మూడు రాష్ట్రాల్లో జరుగుతున్న వివిధ కార్యక్రమాలు, వాటి అమలు, భవిష్యత్ ప్రణాళిక తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సు గతంలో హైదరాబాదులో నిర్వహించే వారని, ఇప్పుడు కరీంనగర్‌లో నిర్వహించడం హర్షణీయమని యూనిసెఫ్ ప్రాజెక్టు జిల్లా సమన్వయకర్త కిషన్‌స్వామి అన్నారు. ప్రతికూల భావోద్వేగాలను నిర్వహించడం అంశంపై, బెంగళూరుకు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు కుచ్చి కృష్ణన్ ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రభాత్, కాశీనాథ్, నర్సింహారెడ్డి, దిలీప్, గిరీష్, సుధీర్, ఫణీంద్ర కుమార్, జిల్లా స్వచ్ఛ భారత్ సమన్వయ కర్తలు రమేష్, వేణు, యూనిసెఫ్ క్లస్టర్ ఫెసిలిటేటర్స్ కళ్యాణి, రవీందర్ పాల్గొన్నారు.

నీట్ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

సుభాష్‌నగర్, జూన్ 20: నీట్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్‌లో అవకతవకలు జరగడం ఆందోళన కరమన్నారు. బీజేపి పాలిత రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ పెద్దల సహకారంతో ఒక్కో విద్యార్థి నుంచి 50లక్షల వరకు తీసుకుని పేపర్ లీక్ చేయడం సిగ్గు చేటన్నారు. గతంలో మాదిరిగానే ఆయా రాష్ట్రాలు వైద్య విద్య పరీక్షలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలన్నారు. లోపభూయిష్టంగా, నిర్లక్ష్యంగా పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాలపై ప్రధాని నరేంద్ర మోదీ పెదవి విప్పకపోవడం సిగ్గు చేటన్నారు. పరీక్షలు నిర్వహించిన పదిరోజు ల్లోగా కీ విడుదల చేయాలని, విద్యార్థుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని ఫలి తాలను ప్రకటించాలన్నారు. కానీ అందుకు విరుద్ధంగా నెలరోజులైనా కీ విడుదల చేయ కుండా ఎన్నికల ఫలితాల రోజునే నీట్ ఫలి తాలను ప్రకటించడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుడికందుల సత్యం, గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు యు శ్రీనివాస్, జి రాజేశం, డి నరేష్, తిప్పా రపు సురేష్ జి తిరుపతి, గజ్జెల శ్రీకాంత్, పుల్లెల మల్లయ్య, రాయికంటి శ్రీనివాస్, వరాల రవి కుమార్, కాల్వ సురేష్, గాజుల కనకరాజు, గాలి పల్లి స్వరూప, రఘు, రోహిత్, బోగేష్, అభిలాష్ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు విద్యార్థులందరికీ వేయాలి

కరీంనగర్ టౌన్, జూన్ 20: నులిపురుగులను పూర్తిగా నిర్మూలించేందుకు 1 నుంచి 19 ఏళ్ల వయసులోపు విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని కలెక్టర్ పమేలా సత్పతి వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. నులిపురుగులతో అనారోగ్య సమస్యలు ఎక్కువగా వస్తాయని అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు శుభ్రత పాటించాలని, చేతులు, కాళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సూచించారు. ఈ రోజు మాత్రలు వేసుకోని వారు ఈనెల 27న వేసుకోవాలని సూచించారు. నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పిల్లలకు అవగాహన కలిగేలా వ్యాసాలు రాయించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు.అనంతరం విద్యార్థులందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మేయర్ యాదగిరి సునీల్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డీఈవో సీహెచ్ వీఎస్ జనార్దన్‌రావు, డీఐవో సాజిదా అతహరి, కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, బండారి వేణు, కచ్చు రవి, సల్ల రవీందర్, సెక్టోరల్ అధికారి అశోక్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ నాజియా పాతిమా,ఎంఈవో మధు సూదనాచారి పాల్గొన్నారు.

శుభాకాంక్షలు.. వినతులు

బిజీగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్





ప్రత్యేక పూజలు చేస్తున్న బండి సంజయ్‌కుమార్, వినతి పత్రం అందిస్తున్న గ్రూప్-1 అభ్యర్థులు

భగత్‌నగర్, జూన్ 20: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ గురువారం కరీంనగర్‌లో బిజీగా గడిపారు. నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ స్వరూపారాణి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నగర మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ బండి సంజయ్‌కుమార్‌కు కేంద్ర మంత్రి పదవి రావడం సంతోషంగా ఉందని, కరీంనగర్ అభివృద్ధి కోసం సహకారం అందించాలని కోరారు. కరీంనగర్‌కు స్మార్ట్ సిటీ నిధులు తీసుకురావడంతో బండి సంజయ్‌కుమార్ కృషి చేశారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గ్రూప్-1 అభ్యర్థుల వినతి

గ్రూప్-1 అభ్యర్థులు తమ సమస్యలుపరిష్కరించాలని కోరుతూ బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ నాలుగేళ్ల లో మూడు సార్లు గ్రూప్-1 పరీక్షలను రద్దు చేయడంతో నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 1:100 చొప్పున మెయిన్స్‌కు ఎంపికచేస్తామని హామీ ఇచ్చారన్నారు. నిరుద్యోగుల డిమాండ్స్ న్యాయమైనవని, ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు 1:100 చొప్పున మెయిన్స్‌కు ఎంపికచేయాలన్నారు. నిరుద్యోగుల డిమాండ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

దివ్యాంగులు కేంద్ర మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● నగరంలోని పాతవాడ శివాలయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా పాతవాడకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి గజమాలతో సత్కరించారు. అనంతరం గంజ్‌లోని వరసిద్ధి వినాయక ఆలయం, కమాన్ దగ్గర రామే శ్వరాలయంలో ప్రత్యేక పూజలునిర్వహించారు. కేంద్ర మంత్రి సంజయ్ కుమార్‌ను బీజేపీ పశ్చిమ జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎన్నం ప్రకాశ్ ఆధ్వర్యంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న దివ్యాంగులు

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

● అస్తవ్యస్తంగా ప్రత్యేకాధికారుల పాలన ● చెత్త సేకరణలో నిర్లక్ష్యం
● నిరుపయోగంగా స్మశాన వాటికలు, క్రీడా ప్రాంగణాలు



వృథాగా దుర్శేడ్ క్రీడా ప్రాంగణం

కరీంనగర్ రూరల్, జూన్ 20: పల్లెలో పారిశుధ్యం పడకేసింది. పట్టించుకోవలసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లో లక్షల రూపాయలు వెచ్చించి గ్రామంలో చెత్త డంపింగ్ యార్డును నిర్మించారు. కాని నిర్మించిన చోట చెత్తన ఉపోయకుండా ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తనంతా ఇరుకుల్ల వాగులో పోసి కాల్చేస్తున్నారు. వర్షాలు కురిసి ఇరుకుల్ల వాగులో వర్షపు నీరు ప్రవహిస్తే కాల్చిన చెత్త, బూడిద, చికెన్ వ్యర్థాలతో నీరు కలుషితం అయ్యే అవకాశం ఉంది. సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో ప్రత్యేకాధికారులను ప్రభుత్వం గ్రామాల సమస్యలను పరిష్కరించ డానికి ఇన్‌చార్జిలుగా నియమించింది. వారు సమస్యలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దుర్శేడ్ గ్రామ పంచాయతీకి సంబంధించిన స్మశాన వాటిక వద్ద నీటి సౌకర్యం లేకపోవడంతో స్నానాలు చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కలెక్టర్ స్పందించి పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా ప్రత్యేకాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.







ఇరుకుల్ల వాగు సమీపంలో, దుర్శేడ్ గ్రామంలో వేస్తున్న చెత్త, దుర్శేడ్‌లో నిరుపయోగంగా స్మశానవాటిక

పరీక్షలను నిర్వహించలేని వారికి పాలించే హక్కులేదు



ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, జూన్ 20: నీట్, నెట్ వంటి పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని వారికి పాలించే హక్కు లేదని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27 వరకుమూడు రోజుల పాటు ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సాయి, బొల్లి సాయి అజయ్, శ్రవణ్, రవి పాల్గొన్నారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

ఇసుక లారీ పట్టివేత

గన్నేరువరం, జూన్ 20: తిమ్మాపూర్ మండలం రేణిగుంట గ్రామ శివారు లో అక్రమంగా ఇసుకను డంపు చేసి ఎక్స్‌కావేటర్ సహాయంతో లోడ్ చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్న తరలిస్తున్న లారీని గురువారం మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు లారీని, ఎక్స్‌కా వేటర్‌ను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ కోరపు సంపత్‌రెడ్డి, ఎక్స్‌కావేటర్ ఆపరేటర్ మెండ శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకు న్నారు. లారీ యజమాని కొండుగారి తిరుపతిరెడ్డి, ఎక్స్‌కావేటర్ యజమాని గూడెల్లి నరేష్, ఇసుక డంపు చేయించిన చింతల అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాండ్ర నరేష్ తెలిపారు.

100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ధర్మారం,జూన్20: ధర్మారం మండలం నర్సింహులపల్లి గ్రామంలో గురువారం అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యంను పౌరసరఫరాల శాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నర్సింహులపల్లి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో 100క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్టు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ చెప్పారు. పంచనామా చేసి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బియ్యంను భద్రపరిచినట్టు తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు ఉన్నారు.

పీజీ పరీక్ష రుసుం గడువు 28 వరకు

గణేశ్‌నగర్,జూన్ 20: ఎం.ఏ, ఎం.కాం, ఎమ్మెస్సీ, ఎం.ఎస్.డబ్ల్యూ,ఎం.బీఏ, ఎం.సీ.ఏ నాలుగో సెమిస్టర్ విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష రుసుం చెల్లించడానికి జూన్ 28వ తేదీ వరకు తుది గడువు అని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300/- రూపాయల అపరాధ రుసుంతో జూలై నెల 2వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలిపారు. పరీక్షలను జూలైలో నిర్వహించనున్నారు.

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థుల డీబార్

గణేశ్‌నగర్, జూన్20: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్షల్లో గురువారం ముగ్గురు విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడటంతో వారిని డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, వాగ్దేవి డిగ్రీ కళాశాల వేములవాడలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో ఒకరు, మొత్తం ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి పంచాయతీ కార్మికుడి మృతి



పోచయ్య(ఫైల్)

వేములవాడ రూరల్, జూన్ 20: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి పడి పంచాయతీ కార్మికుడు మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. నూకలమర్రి గ్రామానికి చెందిన గసికంటి పోచయ్య(63) గ్రామ పంచాయతీలో తాత్కాలిక కార్మికుడిగా మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. గురువారం చెత్త సేకరణలో భాగంగా ట్రాక్టర్‌పై వెళ్తుండగా మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టడంతో పోచయ్య ట్రాక్టర్ పైనుంచి కింద పడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో గమనించిన స్థానికులు వేములవాడ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు, కార్మికులు కోరుతున్నారు. కాగా మృతుడు గసికంటి పోచయ్య కుటుంబానికి తక్షణ సాయం కింద కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 50,000 రూపాయల చెక్కును రూరల్ తహసీల్దార్ సుజాత ద్వారా అందజేశారు.

కార్మికుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

- సీఐటీయూ, ఏఐటీసీయూ ధర్నా



డీపీఎల్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సిరిసిల్ల టౌన్: నూకలమర్రి గ్రామ పంచాయతీ కార్మికుడు గసికంటి పోచయ్య కుటుంబానికి ప్రభుత్వం వెంటనే పది లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిరిసిల్ల పట్టణం జిల్లా ప్రధాన వైద్యశాల ఆవరణలో సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు, జీపీ కార్మికులు ధర్నా చేపట్టారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఎల్‌పీవో నరేష్ సీఐటీయూ, ఏఐటీయూసీ, జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులతో మాట్లాడారు. పోచయ్య కుటుంబానికి పది లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. డీఎల్‌పీవో నరేష్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి దహన సంస్కారానికి రూ.10 వేలు అందజేశారు. నష్టపరిహారంగా ఐదు లక్షల రూపాయల వరకు అందించేలా చూస్తామని డీఎల్‌పీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం డీఎల్‌పీవో నరేష్‌కు కార్మిక సంఘాల నాయకుడు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, నాయకులు లింగంపల్లి కృష్ణవేణి, గంగరాజు, మహేష్, శ్రీనివాస్, రవీందర్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

చిగురుమామిడి, జూన్ 20: మండలంలోని ముదిమాణిక్యం గ్రామ శివారులో కారు (టీఎస్11ఈజే3274) అతివేగంతో చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో గాయపడ్డ నీలాంబర (38) అనే వ్యక్తి గురువారం మృతి చెందినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి మండలానికి చెందిన ముక్కిస నీలాంబర అనే వ్యక్తి బుధవారం ముదిమాణిక్యం నుంచి వెళుతుండగా కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమ్మిత్తం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. నీలాంబర భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

వీణవంక, జూన్ 20: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన వీణవంక మండలంలోని మామిడాలపల్లికి చెందిన సింగరవేని తిరుపతి (33) అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి హార్వెస్టర్ నడుపుతూ జీవించేవాడని మద్యానికి బానిసై 15వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు.మృతుని భార్య రక్షిత పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.






గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్,జూన్ 20: కమాన్‌పూర్ మండలం కిష్టంపల్లి గ్రామానికి చెందిన అక్షయ్ కుమార్ (20) సబ్బితం గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి నిమిత్తం అక్షయ్ కుమార్ తన గ్రామం నుంచి పెద్దపల్లికి ప్రతి రోజు వస్తుంటాడు. బుధవారం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తున్న తరుణంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి రాజబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.







ఒకరి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జూన్ 20: సుల్తానాబాద్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామానికి చెందిన బాబురావు సోదరి నిర్మల మండలంలోని నీరుకుళ్లలో బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అయితే అమె ఆత్మహత్యకు భర్త కారణమంటూ మృతురాలి సోదరుడు బాబురావు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులతో చర్చలు జరుగుతున్నాయి. నష్టపరిహారం కోసం మాట్లాడుతున్న సందర్భంలో బాబురావు తన వద్ద సిద్దంగా ఉంచుకున్న గడ్డిమందు డబ్బా మూత తీసి అందరి ముందే తాగాడు.

అక్కడున్న వారు వెంటనే అతని చేతిలో నుంచి డబ్బా లాగి పడేసి అతన్ని సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనం తరం కరీంనగర్ తరలించారు. తన సోదరి విషయంలో కేసు నమోదులో జాప్యం జరుగుతుండటం, న్యాయం జరిగే అవకాశం లేదని అనుకున్న బాబురావు ఆత్మహత్యయత్నం చేశాడు. అయితే నీరుకుళ్ల మహిళ ఆత్మహత్య కేసులో గురువారం సాయంత్రమే ఫిర్యాదు అందిందని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీడీ టేకేదార్ మృతి



మహేశ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గొల్లపల్లి గ్రామానికి చెందిన బీడీ టేకేదార్ ఊరడి మహేశ్(37) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. అతని పైనుంచి కంటైనర్ వాహనం పోవడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని విజయ-వరస్వామి దంపతుల పెద్ద కొడుకు మహేశ్ స్థానికంగా బీడీ కంపెనీ నిర్వహిస్తూ జీవిస్తుండేవాడు. గొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్లేందుకు యూ టర్న్ తీసుకుంటున్న క్రమంలో కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపునకు ప్రయాణిస్తున్న కంటైనర్ వాహనం బైక్‌ను ఢీకొట్టి ముందుకు దూసుకుపోయింది. మహేశ్‌పై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరుగా రోధించారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కంటేనర్ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు. మృతుడికి తల్లిదండ్రులు విజయ, వరస్వామి, భార్య లావణ్య కూతురు లాస్య, కొడుకు మనోజ్ ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని ఐదుగురికి తీవ్ర గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కావ్య

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని అతివేగంగా ఢీకొట్టడంతో పాటు మరో బైక్‌ను ఢీకొన్న సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని అర్బన్ పార్కు వద్ద గురువారం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వాహనాలను ఢీకొట్టిన యువకుడు రాజేశ్‌ను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని పదిర గ్రామానికి చెందిన రేండ్ల దేవరాజు తన భార్య కావ్య, కూతురు రియాన్ష్‌లతో కలిసి తన బైక్‌పై సిరిసిల్లకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు మద్యం మత్తులో బైక్‌పై అతివేగంగా దూసుకుపోయిన యువకుడు రాజేశ్ ముందుగా దేవరాజు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. వారి వెనుక వస్తున్న గొల్లపల్లిలోని డిగ్రీ విద్యార్థులు ఇరుముల శ్రీమాంత్, వంశీల వాహనాన్ని ఢీకొట్టి ముందుకు పోయాడు. దేవరాజు, కావ్య, రాజేశ్, శ్రీమాంత్, వంశీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్వల్ప గాయాలతో చిన్నారి రియాన్ష్ బయట పడింది. కేసు నమోదు చేనట్లు పోలీసులు వివరించారు.

ఇద్దరు దొంగల అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 20: కరీంనగర్‌లోని మెహర్ నగర్‌లో ఈ నెల 15న చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేశామని మూడో టౌన్ పోలీసులు తెలిపారు. మెహర్‌నగర్‌కు చెందిన సందూరి లక్ష్మి మెడలోని పుస్తెల తాడును తెంపుకుని పారిపోయిన నిందితులు విద్యానగర్‌లో నివాసం ఉంటున్న పున్నం శ్రీనివాస్, సాయినగర్‌కు చెందిన అందె శ్రీనివాస్‌లను ఆదర్శనగర్‌లో అరెస్టు చేశామని తెలిపారు. నిందితుల వద్ద నుంచి 7 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

హోటళ్లు, హాస్పిటల్స్‌పై బల్దియా అధికారుల దాడులు

కరీంనగర్ టౌన్, జూన్20: నగరంలోని పలు హోటళ్లు, హాస్పిటళ్లపై నగర పాలక సంస్థ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. గురువారం నాలుగు హోటళ్లు, రెండు హాస్పిటల్స్‌ను అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్ ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్‌ను పాటించకపోవడం, ఇతరత్రా నిబంధనలకు విరుద్ధంగా వాటిని నిర్వహిస్తున్నట్లు గుర్తించిన సంస్థల నుంచి 9,500 రూపాయల జరిమానా వసూలు చేశారు. తిరిగి ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టప రంగా శిక్షిస్తామని అసిస్టెంట్ కమిషనర్ హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఇసుక డంపును పరిశీలిస్తున్న ఎస్సై

తిమ్మాపూర్, జూన్ 20: మండలంలోని రేణికుంట సమీపంలోని మోయతుమ్మెద వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎల్ఎండీ పోలీసులు గురువారం తెల్లవారు జామున పట్టుకున్నారు. రేణికుంట గ్రామ శివారులో నిల్వ చేసిన సుమారు 20ట్రాక్టర్లకుపైగా ఉన్న ఇసుక డంపులను కూడా స్వాధీనం చేసుకొని రెవెన్యూ శాఖకు అప్పగించామని ఎస్సై చేరాలు తెలిపారు.

అత్యాచారయత్నం చేసిన వ్యక్తి రిమాండ్

హుజూరాబాద్, జూన్ 20: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామానికి చెందిన ఓ వివాహితపై అత్యాచారయత్నానికి పాల్పడిన ట్రాన్స్‌కో ఉద్యోగి షాబుద్దీన్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గోదావరిఖనికి చెందిన సదరు మహిళ కొంతకాలంగా గ్రామంలో టైలరింగ్ పనిచేసుకుంటూ నివాసం ఉంటోంది. ఈ క్రమంలో షాబుద్దీన్ అనే వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో వివాహితపై అత్యాచారయత్నానికి ప్రయత్నించాడు. ఆమె తప్పించుకొని విషయాన్ని బంధువులకు తెలిపింది. వివాహిత ఫిర్యాదు మేరకు షాబుద్దీన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో చట్టం కింద ఒకరి అరెస్టు

మెట్‌పల్లి, జూన్, 20 : పట్టణానికి చెందిన బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బత్తిని నవదీప్‌ను పోక్సో చట్టం కింద అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి పట్టణ అనుసంధాన గ్రామమైన ఆరపేటకు చెందిన బత్తిని నవదీప్ పట్టణానికి చెందిన బాలికపై లైగింక వేధింపులకు పాల్పడినట్లు బాలిక తల్లి ఈ నెల 12న పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి పోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్టీసీ ఈడీని కలిసిన రీజియన్ మేనేజర్లు



ఆర్టీసీ ఈడీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న రీజినల్ మేనేజర్‌లు

భగత్‌నగర్, జూన్ 20: వరంగల్, ఖమ్మం రీజియన్‌లకు నూతన రీజినల్ మేనేజర్లుగా నియమితులైన డి విజయభాను, ఎ నరిరాంలు బుధవారం కరీంనగర్‌లోజోన్ ఈడీ సి వినోద్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. రీజినల్ మేనేజర్‌లుగా పదోన్నతి పొందిన ఇద్దరిని జోన్ ఈడి వినోద్‌కుమార్ అభినందించారు. డి విజయభాను గతంలో చార్మినార్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్‌గా), ఎ నరిరాం రీజియన్‌లో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్)గా పనిచేశారు.

ఆర్టీసీ కరీంనగర్ ఒకటో డీఎం సస్పెన్షన్

భగత్‌నగర్, జూన్ 20: కరీంనగర్ వన్ డిపో మేనేజర్ లక్కు మల్లేశంను ఆర్టీసీ సస్పెండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఈడీ వినోద్‌కుమార్ ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కామారెడ్డి డిపో నుంచి కరీంనగర్ వన్ డిపోకు మేనేజర్‌గా దాదాపు ఏడాదిక్రితం వచ్చిన మల్లేశంపై ఫిర్యాదులు రావడంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు చెబుతున్నారు. సస్పెండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికాలేదు.

ఒకరిపై దాడి.. ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, జూన్ 20: ఇల్లు పంపకం విషయంలో తలెత్తిన వివాదంలో ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన కుంభాల లక్ష్మారెడ్డిపై దాడి చేసిన సంఘటనలో అదే గ్రామంలోని కుంభాల సత్యంరెడ్డి, అతని భార్య మయూరి, ఎలుసాని మల్లారెడ్డిలపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ కిషన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో లక్ష్మారెడ్డి, సత్యంరెడ్డి మధ్య తాతలు సంపాదించిన ఇల్లు విషయంపై గొడవలు జరుగుతున్నాయి. తమను మోసగించి సత్యంరెడ్డి తన పేరిట చేయించుకున్నాడని లక్ష్మారెడ్డి పేర్కొంటున్నారు. ఈ విషయంలో పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించగా ఇల్లు వాటా కింద సోదరుడు లక్ష్మారెడ్డికి రూ.5 లక్షలు చెల్లిస్తానని అంగీకరించారు. యేడాది కిందట సత్యంరెడ్డి రూ.2లక్షలు మధ్యవర్తి ఎలుసాని మల్లారెడ్డికి అప్పగించాడని చెప్పారు. దాంట్లో నుంచి రూ.10 వేలు పట్టుకుని మిగతా డబ్బులు లక్ష్మారెడ్డికి ముట్టజెప్పాడని పేర్కొన్నారు. యేడాది గడిచినా డబ్బులు ఇవ్వకపోవడంతో ఈ నెల 20న మల్లారెడ్డి ఇంటికి వెళ్లి తన డబ్బులు చెల్లించాలని లక్ష్మారెడ్డి కోరాడని తెలిపారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సత్యంరెడ్డి అతని భార్య మయూరి, ఎలుసాని మల్లారెడ్డిలు అడ్డగించి కర్రలతో దాడికి దిగారని లక్ష్మారెడ్డి చెప్పారు. లక్ష్మారెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడని పేర్కొన్నారు. బాధితుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు సత్యంరెడ్డి, మయూరి, మల్లారెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఏఎస్ఐ కిషన్‌రావు వివరించారు.

ప్రతి ఒక్కరూ శరణార్థులకు చేయూతనివ్వాలి



విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, జూన్ 20: ప్రతి ఒక్కరూ శరణార్థులకు చేయూతనివ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం శరణార్థుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శనలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది శరణార్థులు ఉన్నారన్నారు. ఐక్యరాజ్య సమితి శరణార్థులకు తగు గుర్తింపునివ్వడం ద్వారా వారి సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి సహకరించండి

-కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి మేయర్ వినతి



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి పుష్పగుచ్ఛం ఇస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూన్20: కరీంనగర్ మరింత అభివృద్ధి జరిగేందుకు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను మేయర్ యాదగిరి సునీల్‌రావు విజ్ఞప్తి చేశారు. కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు స్వీకరించి నగరానికి మొదటిసారి వచ్చిన బండి సంజయ్‌కుమార్‌ను మహాశక్తి దేవాలయంలో గురువారం మేయర్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి సంజయ్‌కుమార్‌తో స్మార్ట్‌సిటీ, ఇతర అభివృద్ధి అంశాలపై మేయర్ చర్చించారు. ఈ సందర్భంగా సునీల్‌రావు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో సహచర కార్పొరేటర్‌గా పనిచేసిన బండి సంజయ్ కుమార్ రెండుసార్లు ఎంపీగా ఎన్నికై కేంద్రమంత్రి కావడం నగర ప్రజలకు గర్వకారణమని అన్నారు. నగరంలో జరుగుతున్న స్మార్ట్‌సిటీ పనులు, ఇతరత్రా నిధులతో చేపడుతున్న అభివృద్ధి అంశాలపై మంత్రితో చర్చించామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్, బండ సుమ రమణారెడ్డి, కాసర్ల ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంపత్‌కుమార్

కరీంనగర్ టౌన్, జూన్ 20: టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బుర్ర సంపత్‌కుమార్‌గౌడ్ (ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి) ఎన్నికయ్యారు. ఖమ్మంలో జరిగిన యూనియన్ ఎన్నికల్లో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎలగందుల రవీందర్, జె.సురేందర్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి రాష్ట్ర కమిటీలో ప్రాతినిధ్యం లభించడం పట్ల పలువురు జర్నలిస్టులు, యూనియన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

'మేయర్ పక్కా అవకాశవాది'

కరీంనగర్ అర్బన్, జూన్ 20: మేయర్ సునీల్‌రావు పక్కా అవకాశవాదని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి విమర్శించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై గత పదేళ్లుగా లేని ప్రేమ ఇప్పుడు ఎందుకు వచ్చిందో చెప్పాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లా అధికారులతో మునిసిపల్ సమీక్షా సమావేశం నిర్వహిస్తే మేయర్ ఎందుకు భుజాలు తడుముకుంటున్నాడని అన్నారు.

'సునీల్‌రావుకు మంత్రిని విమర్శించే అర్హత లేదు'

కరీంనగర్ అర్బన్, జూన్ 20: మేయర్ సునీల్‌రావుకు పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే హక్కు లేదని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో రాహుల్ మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కరీంనగర్ నగర మేయర్ సునీల్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సునీల్‌రావు అక్రమాలపై ఆధారాలతో ప్రజా కోర్టులో నిలబెడతామన్నారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పంజల కృపాసాగర్, కిమ్ ఫహద్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు నాయకుల వినతి



ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌తో మాట్లాడుతున్న నాయకులు

చిగురుమామిడి, జూన్ 20: మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గురువారం జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు రీజినల్ మేనేజర్ సుచరితను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గీకురు రవీందర్ మాట్లాడుతూ హుస్నాబాద్ నుంచి చిగురుమామిడి, చిన్నముల్కనూర్, ఇందుర్తి, గ్రామాల మీదుగా హైదారాబాద్ కు వెళ్లేదుకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరామని చెప్పారు. హుస్నాబాద్ నుంచి వయా పీచుపల్లి, మోడల్ స్కూల్ బస్సు గాగిరెడ్డిపల్లి, లంబాడిపల్లి, మీదుగా వెళ్లేలా చూడాలని కోరామని తెలిపారు. హుస్నాబాద్ నుంచి సుందరగిరి, ఇందుర్తి, ముదిమాణిక్యం, రామంచ, చిన్నముల్కనూర్ మీదుగా కరీంనగర్‌కు వెళ్లేలా బస్సులు వేయాలని కోరామని వివరించారు. కొన్ని రూట్లల్లో వెంటనే కల్పిస్తామని చెప్పారని తెలిపారు. మరి కొన్నింటికి సమయం పడుతుందని తెలిపారని వివరించారు. కార్యక్రమంలో సత్యనాయణరెడ్డి, చిట్టుమల్ల రవీందర్, చీల లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపూర్‌లో పెద్దమ్మ బోనాలు



లక్ష్మీపూర్‌లో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

మానకొండూర్, జూన్ 20: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ముధిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం మహిళలు పెద్దమ్మ బోనాలను నిర్వహించారు. మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పుచప్పుళ్ళ మధ్య ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వీర్ల గౌరయ్య, ఉపాధ్యక్షుడు వీర్ల సంతోష్‌కుమార్, కార్యదర్శి పిట్టల శంకర్ పాల్గొన్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూన్ 20: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 108క్వింటాళ్లు విడి పత్తి, నలుగురు రైతులు మూడు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,350, కనిష్ఠ ధర 5,800 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

-జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ -జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ



హుజూరాబాద్‌లో చిన్నారికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ విజయ, గంగాధరలో..

హుజూరాబాద్, జూన్ 20: పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ అన్నారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్పీ చైర్‌పర్సన్ హాజరై చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైద్యులు మధుకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● **కరీంనగర్ రూరల్:** పిల్లలందరూ తప్పకుండా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని ఒకటో డివిజన్ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. తీగలగుట్టపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండజోల్ టాబ్లెట్లను ఉచి తంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర వైద్యులు, ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

● **భగత్‌నగర్:** కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక, ఏఎన్ఎం ఉమ, ప్రధానోపాధ్యాయురాలు తదతరులు పాల్గొన్నారు.

● **జమ్మికుంట:** జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మున్సిపాల్టీ, గ్రామీణ ప్రాంతాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, కాకతీయ ఈ-టెక్నో పాఠశాలలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటిలు విద్యార్థులకు మాత్రలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ చందన, బిందు, సంధ్యారాణి, మహోన్నత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, కౌన్సిలర్లు మొలుగు ప్రణీత, కల్వల దీప్తి-కిషన్‌రెడ్డి, శ్రీపతి నరేష్, దిడ్డి రాము, గాజుల భాస్కర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

● **శంకరపట్నం:** కేశవపట్నం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్యాంప్రసాద్ పిల్లలకు నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం స్కూల్ పిల్లలకు వైద్య సిబ్బందితో ఆల్బెండజోల్ మాత్రలను వేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొజ్జ కవిత, ప్రిన్సిపాల్ మాధవి, సీహెచ్‌వో భాస్కర్, హెల్త్ సూపర్‌వైజర్ అనిల్ పాల్గొన్నారు.

● **సైదాపూర్:** మండల వ్యాప్తంగా చిన్నారులకు నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. కార్యక్రమంలో వైద్యులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **గంగాధర:** ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న నులిపురుగుల నివారణ మందు లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి సరస్వతి అన్నారు. పత్తికుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఆమె ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రా లు, కళాశాలల్లో 19 ఏళ్లలోపు వయస్సు గల 12,589 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేసినట్లు వైద్యాధికారి శ్వేత తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్ రమాదేవి, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **ఇల్లందకుంట:** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణకు 1-19సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తులసిదాస్ మాట్లాడుతూ మండలంలోని పీహెచ్‌సీ పరిధిలో 1,886మంది పిల్లలకు మాత్రలను వేశామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కల్యాణ్, సీహెచ్‌వో శ్యామల, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, హెచ్ఎం సాంబయ్య, ఏఎన్ఎం సునీత, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

● **చిగురుమామిడి:** పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలని ఎంపీపీ కొత్తవినీత-శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఎంపీపీ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్ మండల వైద్యాధికారి విప్లవశ్రీ పాల్గొన్నారు.

● **వీణవంక:** మండల వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులను వైద్యురాలు కీర్తన పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో శ్రీధర్ హాజరై మాత్రలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **రామడుగు:** పిల్లల సక్రమ ఎదుగుదలతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు నులి పురుగు నివారణ మాత్రలను వేయించాలని ఎంపీపీ జవాజి హరీష్ తల్లిదండ్రులకు సూచించారు. గురువారం మండలంలోని గోపాల్‌రావుపేట, రామడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో వేణుకుమార్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బొమ్మరవేని తిరుమల, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'మేయర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం'

సుభాష్‌నగర్, జూన్ 20: మంత్రి పొన్నం ప్రభాకర్ పట్ల మేయర్ సునీల్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పులి ఆంజనేయులు గౌడ్ అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులతో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో చేపట్టిన స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

'దాడిపై కేంద్ర మంత్రి స్పందించాలి'

సుభాష్‌నగర్, జూన్ 20: బేడ బుడగ జంగాలపై జరిగిన దాడిపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించాలని కుల వివక్ష పోరాట సమితి జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేష్ కోరారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామంలో బేడ బుడగ జంగాల కుటుంబాలపై వంద మంది గౌడ కులస్తులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారన్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. దాడులకు పాల్పడిన వారందరిని రిమాండ్ చేయాలన్నారు. బాధితులకు ప్రాణహాని ఉందని వారికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి గాజుల కనకరాజు, కండె రాజు, దాసరి కనకేష్, కళ్యాం శివాజీ, విభూతి రమేశ్, మహేందర్, కళ్యాం సాయి, అనిల్, టేకు నర్సింహులు, మిర్యాల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి

-ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు

గణేశ్‌నగర్, జూన్ 20: ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీని ప్రభుత్వం, అధికారులు అరికట్టాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు డిమాండ్ చేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ విద్యారంగం మీద రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పట్టింపు లేకుండా పోయిందని తెలిపారు. బ్రాండ్ల పేరుతో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. నూతనంగా ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ముఖ్యమంత్రి విద్యారంగం గురించి మాట్లాడిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో విద్యకు మంత్రి కరువైపోయారన్నారు. ప్రభుత్వం విద్యారంగాన్ని అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీని కోసం స్పెషల్ కమిటీని వేసి పరిస్థితులను చక్కదిద్దాలని ఆయన కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రైవేట్ పాఠశాలల దోపిడీని విద్యాధికారులు అరికట్టకుంటే ఏబీవీపీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించడానికి సిద్ధంగా ఉందని ఆయన హెచ్చరించారు. లేకపోతే గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వానికి కూడా బుద్ధి చెప్పే దిశగా ఏబీవీపీ ఉద్యమ కార్యచరణ ఉంటుందని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి బామాండ్ల నందు, రాష్ట్రకార్యవర్గ సభ్యులు చింతలతాడేం మధు, జిల్లా హాస్టల్స్ ఇంచార్జ్ వర్ధన్, నగర సంయుక్త కార్యదర్శి వంశీ, ఉదయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, జూన్ 20: తెలంగాణ రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో 25వ తేదీన నిర్వహించే మెగా జాబ్‌మేళాను మానకొండూర్ నియోకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ప్రజాభవన్(క్యాంపు కార్యలయంలో)లో గురువారం మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామ పరిధిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 25న మెగా జాబ్ మేళాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10గంటల నుంచి జాబ్ మేళా ప్రారంభం కానుందని, 60కు పైగా కంపెనీలు రానున్నట్లు వివరించారు. వీటి ద్వారా 5వేలకు పైగా ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. 18-35 సంవత్సరాల వయస్సు గల నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత ఈ జాబ్‌మేళాలో పాల్గొన వచ్చునని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, ఎంపీటీసీ బండారి రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోగురి నరసింహారెడ్డి, తిమ్మాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

● **విద్యాభివృద్ధికి పెద్దపీట**

మానకొండూర్: విద్యాభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పోచంపల్లిలోని ఆదర్శ పాఠశాల, దేవంపల్లిలోని గురుకుల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధించేందుకు నాణ్యమైన విద్యనందిస్తుందన్నారు. ఆదర్శ పాఠశాలలోని క్రీడా మైదానాన్ని ట్రాక్టర్‌ను నడుపుతూ చదను చేశారు. అనంతరం ఆయా పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. కూరగాయల సాగుతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కోసం ఎంపీపీ నిధుల నుంచి మంజూరు చేయించారు. శుక్రవారంలోగా కొత్త భోరును వేయించి విద్యార్థులకు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరనిష్కరిస్తానని తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మాత్రలను వేశారు. అనంతరం లక్ష్మీపూర్‌లో నిర్మిస్తున్న పీహెచ్‌సీ భవనాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముద్దసాని సులోచన, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుజాత, ఎంపీడీవో నర్సయ్య, కాంగ్రెస్ మండల నాయకులు రవీంద్రాచారి, ముద్దసాని శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బండి సంజయ్ రాక

హుజూరాబాద్, జూన్ 20: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం హుజూరాబాద్‌కు రానున్నారని బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బండి సంజయ్‌కుమార్ హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్ట మొదటి సారిగా హుజూరాబాద్‌కు వస్తున్నారని, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఘన స్వాగతం పలికాలని కోరారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ శుక్రవారం రానున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారని తెలిపారు.

మిగులు సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

గంగాధర, జూన్ 20: గంగాధరలోని చొప్పదండి నియోజకవర్గ మైనారిటీ గురుకుల బాలిక పాఠశాలలో మిగులిపోయిన సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వారుణి తెలిపారు. గంగాధరలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గంగాధర మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో ఆరో తరగతిలో ఎస్టీలకు 3, ఎస్సీలకు ఒకటి సీట్లు ఖాళీ గా ఉన్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 25 లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అధిక ధరలపై చర్యలేవీ?

- యథేచ్ఛగా బెల్టుషాపుల్లో దోపిడీ
- మండల సమావేశంలో తీర్మానం చేసినా చర్యలు శూన్యం



మండల సమావేశంలో నిరసన తెలియజేస్తున్న సభ్యులు(ఫైల్)

చిగురుమామిడి, జూన్ 20: మండలంలోని వైన్స్ షాపుల్లో, బెల్టుషాపుల్లో మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలో ఉన్న రెండు వైన్స్ షాపులు ఉన్నాయి. వీటి యాజమానులు ఒక్కో మద్యం బాటిల్‌పై 60, 80 రూపాయలు అదనంగా తీసుకుంటూ కొనుగోలుదారులను దోపిడీ చేస్తున్నారు. కాగా బెల్టుషాపుల నిర్వాహ కులు ఫుల్ బాటిల్‌పై 160, క్వార్టర్‌పై అదనంగా 40 రూపాయలు తీసుకుంటున్నారు. మం డలంలోని 17 గ్రామాల్లో సుమారు 110 బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. మద్యం విక్రయాల్లో దోపిడీపై మార్చి 16వ తేదీన నిర్వహించిన మండల సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు నేలపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీనిపై ఎంపీపీ కొత్త వినీత-శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మద్యం విక్రయాల్లో దోపిడీపై కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్క రిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సమావేశంలో దోపిడీని అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కాగా దీనిపై చర్యలు లేక పోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నారని ప్రజలు వాపోతు న్నారు. వైన్స్ షాపుల యాజమానులు ఇస్తున్న మాముళ్ల వల్లే అధికారులు దోపిడీని అరికట్టేందుకు చర్యలు తీసుకో వడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మద్యం అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

బెల్టుషాపులను నియంత్రించాలి..

మండలంలో బెల్టుషాపులను నియంత్రించాలి. మద్యం అధిక ధరలకు విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నారు. వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మండల సమావేశంలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసినా అధికారుల్లో చలనం లేదు. ప్రభుత్వం బెల్టుషాపులు నిర్వహించొద్దని చెబు తున్నా ఆచరణలో అమలు కావడం లేదు. అధికారులు పట్టించుకోకుంటే ఆందోళనలు చేపడుతాం.

- అందె స్వప్న, ఇందుర్తి ఎంపీటీసీ సభ్యురాలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, జూన్ 20: నగరంలో విద్యుత్ లైన్ మరమ్మతులో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. కోతిరాంపూర్ ఏరియా, పోచమ్మవాడలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

'నీట్'పై సమగ్ర విచారణ జరపాలి

కరీంనగర్ అర్బన్, జూన్ 20: నీట్ పరీక్ష కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎస్సీ సెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీ 10 ఏళ్ళుగా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేపర్ లీకేజీ ఘటనలు ఎన్ని జరిగిన కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. నీట్ పేపర్ లీకేజి కుంభకోణానికి నిరసనగా కాంగ్రెస్‌పార్టీ దేశవ్యాప్తంగా శుక్రవారం చేపట్టనున్న నిరసన ప్రదర్శనలు, ధర్నాలలో విద్యా ర్థులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు.

పంట రుణాలు అందించాలి

భగత్‌నగర్, జూన్ 20: పంట వేసినప్రతి రైతుకు పంట రుణాలు అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకెఎస్) జిల్లా కార్యదర్శి పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బిసి ఆదేశాల ప్రకారం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు అనుగుణంగా పంటరుణాలు ఇవ్వాలన్నారు.

మత్తు పదార్థాల వినియోగంతో దుష్పరిణామాలు

కరీంనగర్ క్రైం, జూన్20: నిషేధిత మత్తు పదార్థాల వినియోగంతో తలెత్తే దుష్పరిణామాలపై కరీంనగర్ ఆదర్శనగర్‌లోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు కరీంనగర్ మూడో టౌన్ సీఐ జాన్‌రెడ్డి అవగాహన కల్పించారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ఎక్కడైనా మత్తుపదార్థాల వినియోగం, అమ్మకాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియ జేయాలని కోరారు.

నేడు సంగీత దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, జూన్ 20: ప్రపంచంలోని పలు దేశాల్లో ఏటా సంగీత దినోత్సవాలను నిర్వహిస్తున్నారు. మన దేశంలో జూన్ 21న సంగీత దినోత్సవాన్ని జరుపుతున్నారు. ప్రస్తుతం యువత చేతిలోని ఫోన్‌లోనే సంగీతాన్ని ఆస్వాదిస్తున్నారు. కర్ణాటక, హిందూస్థానీ, జానపద సంగీతం, సినీ సంగీతాలు ఎంతో ఆదరణ పొందుతున్నాయి. మన దేశానికి చెందిన సంగీత విద్వాంసులు, గాయకులు మన సంగీత గొప్పతనాన్ని ప్రపంచ దేశాల్లో చాటి చెప్పారు.

జాలరిని సన్మానించిన టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్, జూన్ 20: ఎల్ఎండీ కెనాల్‌లో ఇద్దరు పిల్లలను రక్షించిన జాలరి శంకర్‌ను గురువారం టీఎన్‌జీవో భవన్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకుడు రాగి శ్రీనివాస్, సిహెచ్ జోయల్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్, పోలు కిషన్, రవీందర్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, రాజేశ్వర్‌రావు, వెలిచాల సుమంత్‌రావు, నేరేళ్ళ కిషన్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

నియామకం

కరీంనగర్ టౌన్, జూన్ 20: జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడిగా తలకొక్కుల సదానందం నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బద్దీపడుగ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిటీ జాతీయ అధ్యక్షుడు మహ్మద్ యాసిన్ ఆదేశాల మేరకు సదానందంను నియమించినట్లు పేర్కొన్నారు.

అవినీతి బయటపడుతుందనే మంత్రిపై ఆరోపణలు

కరీంనగర్ రూరల్, జూన్ 20: స్మార్ట్ సిటీ పనుల్లో అవినీతి బయటపడుతుందనే మంత్రి పొన్నంపై మేయర్ సునీల్‌రావు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు కాశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం తీగలగుట్టపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు మూల కృష్ణారెడ్డి, మూల రాజిరెడ్డి, పోలు రాజ్‌కుమార్, అల్లిబిల్లి నగేష్, వినయ్, కాశెట్టి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభించాలి

చొప్పదండి, జూన్ 20: పట్టణంలో నిలిచిపోయిన రహదారి, సెంట్రల్ లైటింగ్ పనులను వెంటనే ప్రారంభించాలని అంబేడ్కర్ సంఘం యువజన నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరు నెలలుగా రహదారి విస్తరణ పనులు నిలిచి పోయాయని వెంటనే పూర్తి చేయాలని కోరారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

రామడుగు, జూన్ 20: ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ డబ్బులను విడుదల చేయడంపై రామడుగు మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పలువురు నాయకులు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో కట్ట రవీందర్, అంజిబాబు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సింగిల్‌విండో అధ్యక్షుడిగా ప్రదీప్‌రెడ్డి

మానకొండూర్, జూన్ 20: ఊటూర్ సహకార సంఘం అధ్యక్షుడిగా ముద్దసాని ప్రదీప్‌రెడ్డి రెండోసారి పదవీ బాధ్యతలు చేపట్టారు. సహకార సంఘంలో ఓవర్‌ద్యూను వసూలు చేయడంలో సంఘం అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి నిర్లక్ష్యం చేశారని సభ్యుల ఫిర్యాదు మేరకు జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు ఈ నెల 6న విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రదీప్‌రెడ్డి వరంగల్‌లోని కో-ఆపరేటివ్ ట్రిబ్యూనల్ కోర్టును ఆశ్రయించారు. ఉత్తర్వులపై స్టే విధించడంతో గురువారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఎడ్ల సతీష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.